క్లుప్తంగా

వేసవి శిక్షణతో వ్యక్తిత్వ వికాసం


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడగాయని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం శిక్షణ శిబిరానికి 35 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్, తెలుగు గ్రామర్, డ్రాయింగ్ తదితర అంశాలపై ఇస్తున్న శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, పీవీ గురుస్వామి పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో సీట్లకు దరఖాస్తు చేసుకోండి

కంభం: 2025–26 విద్యాసంవత్సరానికి గాను ప్రైవేట్ పాఠశాలల్లో ఉచితంగా ఒకటో తరగతి ప్రవేశానికి తలిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ మాల్యాద్రి గురువారం ఒక ప్రకటనలో సూచించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లను పేదలకు ఉచితంగా కేటాయిస్తారని, అర్హులైన వారు ఈనెల 19వ తేదీ వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2019 జూన్ 2 నుంచి 2020 మే 31వ తేదీ మధ్యలో జన్మించిన పిల్లలు అర్హులని స్పష్టం చేశారు.

కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

పొదిలి: స్థానిక దర్శి రోడ్డులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయింది. కళాశాల భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మెడికల్ కౌన్సిల్ సభ్యురాలు డాక్టర్ స్వర్ణ గీత, ఏఎంసీ చైర్మన్ ఇమాంసాహేబ్, నగర పంచాయతీ కమిషనర్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ శోభన్‌బాబు, ఎంఈఓ మామిళ్లపల్లి శ్రీనివాసరెడ్డి, ప్రత్యేకాధికారి అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


బీసీ కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్ నారాయణరెడ్డి

పొదిలి: పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవడం సామాజిక బాధ్యతని స్థానిక నగర పంచాయతీ కమిషనర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కెవి పాలెం, బీసీ కాలనీ, పెద్ద బస్టాండ్, చిన్న బస్టాండ్, ఆంజనేయస్వామి గుడి వీధుల్లో ఆయన పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ.. చెత్తను కుండీల్లో కాకుండా ఎక్కడంటే అక్కడ వేయడం వల్ల అపరిశుభ్రతకు కారణమవుతారన్నారు. వీధులు స్వచ్ఛతగా ఉండేందుకు ప్రజలు తమ వంతు సహకారం అందివ్వాలని కోరారు. మంచినీరు, పారిశుధ్య సమస్యలను తక్షణమే పరిష్కారం చేయిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం టౌన్: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో 2025–26 సంవత్సరానికిగాను మొదటి విడత(ఫేజ్-1) ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.నరేంద్రనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో ఫిట్టర్, డీజిల్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్, సివిల్ తదితర విభాగాల్లో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 95533 06631ను సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు


ఉత్సవంలో చెన్నకేశవస్వామి

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతీ సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారికి రుద్రమండపం, వాహన ఉత్సవం నిర్వహించారు. ఉత్సవ ఉభయ దాతలుగా బాపతి, పావన కుటుంబ సభ్యులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకట కృష్ణ కిరణ్, నుదురుపాటి వెంకటకృష్ణారావు స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శుక్రవారం హనుమంత వాహన ఉత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

బెడిసికొట్టిన ప్లాన్!



- భవన నిర్మాణాల అనుమతికి జీవో 20 తెచ్చిన కూటమి సర్కార్
- ప్లాన్ ప్రకారం నిర్మించకపోతే ఎల్‌టీపీలను బాధ్యులను చేస్తూ నిర్ణయం
- దీంతో మూడు నెలలుగా అప్రూవల్‌కు నోచుకోని ప్లాన్లు
- పట్టణాల్లో నిలిచిపోయిన నూతన భవనాల నిర్మాణ పనులు
- పర్యవేక్షణ బాధ్యత టౌన్ ప్లానింగ్‌దే అంటున్న ఎల్‌టీపీలు



మార్కాపురం టౌన్:

పట్టణాల్లో పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కలకు చిక్కులొచ్చాయి. ఇల్లు నిర్మించుకోవాలన్న వారి ఆశలపై కూటమి సర్కారు తెచ్చిన జీఓ 20 ఆవిరి చేసింది. సులభంగా భవన నిర్మాణ అనుమతులు పొందవచ్చని కూటమి సర్కారు పెద్ద ఎత్తున ప్రచారం చేసి తీసుకొచ్చిన జీఓను అటు ప్రజలతోపాటు ఇటు ఎల్‌టీపీ(లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్)లు వ్యతిరేకిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణాల్లో భవనాల నిర్మాణానికి సంబంధిత మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి తప్పనిసరిగా అనువతి తీసుకోవాల్సి ఉంటుంది. దీనికిగాను ఎల్‌టీపీలు ఓ ప్లాన్‌ను రూపొందించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేవారు. టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి అనుమతి రాగానే దరఖాస్తుదారులు తమ భవనాలను నిర్మించుకునేవారు. ఇదంతా గతం.. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక నిబంధనలు మారుస్తూ ప్రత్యేక జీఓ జారీ చేసింది. దీనిద్వారా ఇంటి ప్లాన్ అప్రూవల్‌ను భవన యజమానులు సులభంగా పొందవచ్చని ప్రభుత్వం చెబుతోంది కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ప్లాన్‌ను అతిక్రమించి ఇంటి నిర్మాణం చేపడితే ఎల్‌టీపీపై చర్యలు తీసుకుంటామని, లైసెన్స్ రద్దు చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేయడంతో బిల్డింగ్ ప్లాన్ ఇచ్చేందుకు వారు ముందుకు రావడం లేదు.

మార్కాపురం, గిద్దలూరు, పొదిలి పురపాలక సంఘాల్లో భవన నిర్మాణాలకు ప్లాన్‌లు మంజూరు కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు సులభతరంగా ఉండేలా విధివిధానాలు రూపొందించి అమలు చేయాల్సిన ప్రభుత్వం ఎల్‌టీపీలను బాధ్యులను చేయడం సరికాదన్న వాదన సర్వత్రా వినిపిస్తోంది. బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌బాధ్యతలను స్వీయ సర్టిఫికేషన్ స్కీమ్(ఎస్‌సీఎస్) విధానంతో తమకు అప్పగించడాన్ని ఎల్‌టీపీలు తొలి రోజుల నుంచే వ్యతిరేకిస్తున్నారు. అయినా తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్న చందంగా కూటమి ప్రభుత్వం ముందుకు అడుగులు వేయడంతో భవనాల నిర్మాణానికి అడ్డంకిగా మారింది.

ఎవరి తప్పునకు ఎవరు బాధ్యులు?

ప్లాన్ పొందిన భవన యజమాని ప్లాన్‌ను అతిక్రమిస్తే తమను బాధ్యులను చేసి చర్యలు తీసుకోవాలనడం హాస్యాస్పదమని ఎల్‌టీపీలు అభిప్రాయపడుతున్నారు. తమకెందుకొచ్చిన తంటా అని సుమారు మూడు నెలలుగా ప్లాన్లు ఇవ్వకుండా నిరసన తెలుపుతున్నారు. మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులిచ్చే విధానంలో లోపాలు జరుగుతున్నాయని ప్రభుత్వం ఈ బాధ్యతను ఎల్‌టీపీలకు అప్పగిస్తూ జీవోను జారీ చేసింది. ఏదైనా బిల్డింగ్‌కు ప్లాన్ ఇస్తే 10 శాతం వరకు అతిక్రమణకు మినహాయింపు ఉంటుంది. అంతకు మించి అతిక్రమణ జరిగితే భవన నిర్మాణాన్ని నిలిపివేస్తారు. ప్లాన్ పొందిన వారు నిబంధనలు మీరితే ఎల్‌టీపీ లైసెన్స్‌ను ఐదేళ్లపాటు రద్దు చేయడంతోపాటు వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్న నిబంధనను పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు.


మార్కాపురం పట్టణ వ్యూ

ఆదాయం నిల్

బిల్డింగ్ ప్లాన్‌లను ఎల్‌టీపీలు ఇవ్వకపోవడంతో భవన నిర్మాణాలు నిలిచిపోయి ఆయా మున్సిపాలిటీలకు ఆదాయం పడిపోయింది. జీఓ 20 జారీ చేసే నాటికి మార్కాపురం మున్సిపల్ కార్యాలయానికి సుమారు 24 ప్లాన్లు అనుమతి కోసం వచ్చాయి. జీఓ జారీ అయిన దరిమిలా ఒక్క ప్లాన్ కూడా మంజూరుకు నోచుకోలేదు. గత ఏడాది 300 చదరపు మీటర్లలోపు భవనాలకు సుమారు 80 నుంచి 90 వరకు ప్లాన్‌లు రాగా.. జీఓ 20 జారీ చేసిన తర్వాత ఒక్కటి కూడా రాలేదంటే పరిస్థితి ఎంత జఠిలంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

తమపై చర్యలను మినహాయిస్తే జీఓను స్వాగతిస్తాం

భవన యజమానులు ప్లాన్‌ను అతిక్రమిస్తే ఎల్‌టీపీలను బాధ్యులను చేయని పక్షంలో ప్రభుత్వం జారీ చేసిన జీఓ 20ని స్వాగతిస్తాం. ఎల్‌టీపీలు అందరిదీ ఇదే మాట. ఇంటి నిర్మాణాల్లో అతిక్రమణ జరిగితే భవన యజమాని బాధ్యుడవుతారు కానీ ఎల్‌టీపీ తప్పు ఎలా అవుతుంది. ఈ విధానాన్ని సరిచేసి మళ్లీ జీఓ ఇవ్వాలని కోరుతున్నాం.

– ఎస్‌డీ నయీమ్,
సీనియర్ ప్లానర్, మార్కాపురం

ఒక్క ప్లాన్ కూడా అనుమతి పొందలేదు

పట్టణాల్లో సులభతరంగా భవన నిర్మాణ అనుమతులు పొందేందుకు ప్రభుత్వం జీఓ 20 జారీ చేసింది. అయితే ఇప్పటి వరకు ఒక్క ప్లాన్ కూడా అనుమతి పొందలేదు. ప్రభుత్వం జీఓను సవరించాలని ఎల్‌టీపీలు కోరుతున్నారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం మేము పనిచేయాల్సి ఉంటుంది.

– శ్రీనివాస్,
టౌన్ ప్లానింగ్ అధికారి, మార్కాపురం

హక్కుల కోసం అలుపెరగని పోరాటం


పొదిలిలో కార్మిక జెండా ఆవిష్కరిస్తున్న రమేష్



కంభంలో కార్మిక జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

- కార్మిక వర్గాల జీవితాలపై పన్నుల భారం ప్రభావం
- కార్మిక సంక్షేమానికి తూట్లు పొడిచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు
- మే డే వేడుకల్లో కార్మిక సంఘాల నేతల ధ్వజం

కార్మికుల హక్కుల సంరక్షణకు అలుపెరగకుండా పోరాటం చేయాలని వివిధ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మేడే వేడుకలను గురువారం ఏఐటీయూసీ, సీపీఐ, సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. కార్మిక జెండాలు ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు.

మార్కాపురం: పట్టణంలోని పూల సుబ్బయ్య కాలనీ, పాత బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, ఎల్ఐసీ ఆఫీస్, బీఎస్ఎన్ఎల్ ఆఫీసు, ఆర్టీసీ డిపో, జీజీహెచ్ తదితర ప్రాంతాల్లో కార్మిక జెండాలు ఆవిష్కరించారు. పలు కార్యక్రమాల్లో సీపీఐ నేత అందె నాసరయ్య, సీపీఎం నాయకుడు సోమయ్య మాట్లాడుతూ.. ఎందరో కార్మికుల ప్రాణ త్యాగం ఫలితంగా 8 గంటల పనిదినాలను సాధించుకున్నామన్నారు. కార్మిక హక్కులను కాలరాసే విధంగా బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విమర్శించారు. హక్కుల పరిరక్షణ కోసం పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్న మోదీ ప్రభుత్వం మరోవైపు పేదలపై విపరీతమైన పన్నుల భారాన్ని మోపుతోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సెక్రటరీ ఎస్కే ఖాశీం, పట్టణ సీపీఐ కార్యదర్శి చిత్తారి పెద్దన్న, సిఐటియు నాయకులు సుబ్బరాయుడు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు జవ్వాజి రాజు, సీపీఎం నాయకులు ఎం.వెంకయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వై.వెంకటరెడ్డి, లాయర్ కడియం రామయ్య తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ డిపో వద్ద ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శాస్త్రీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు.

మేడే స్ఫూర్తితో ఐక్యపోరాటాలు

పొదిలి: కార్మిక వర్గాలు మేడే స్ఫూర్తితో ఐక్య పోరాటాలతో ముందుకు సాగాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ పిలుపునిచ్చారు. గురువారం పొదిలిలో పలు ప్రాంతాల్లో కార్మిక జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులను యాజమాన్యాలకు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకిస్తూ మే 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ముందుగా పెద్ద బస్టాండ్ నుంచి చిన్న బస్టాండ్ వరకు ఆయా సంస్థల కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్‌హై, కార్యదర్శి పి.బాల వెంకటేశ్వర్లు, సీఐటీయూ మండల కార్యదర్శి బి.కోటేశ్వరరావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు వి.ప్రభుదాసు, షేక్.మస్తాన్‌వలి, డి.పాపారావు, కాకర్ల వెంకటయ్య, కె.ప్రసాద్, యుద్ధం శ్రీను, హనుమంతారెడ్డి, ఎస్‌కె.సుబాని, ఎం.శోభారాణి, వి.వినోద్, రమణయ్య, గురవయ్య, చెన్నయ్య, వి.దాసు, రామచంద్రారెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు: మండల కేంద్రం తర్లుపాడులో కార్మిక జెండా ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు బాల నాగయ్య మాట్లాడుతూ ఆటో వర్కర్లు, ముఠా వర్కర్లు, భవన కార్మికుల కోసం సమగ్ర చట్టంచేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి జె.నాగరాజు, కార్యదర్శి వై.పాపిరెడ్డి, ఆటో యూనియన్ నాయకులు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండల కేంద్రమైన కొనకనమిట్లలో వామపక్షాలు, ఏఐటీయూసీ, సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద, గుజ్జుల యలమందారెడ్డి స్మారక భవనంలో మేడే వేడుకలు నిర్వహించి జెండాలు ఆవిష్కరించారు. వామ పక్షాల నాయకులు కొక్కెరమిట్ల కోటేశ్వరరావు, పిల్లి బాలనరసయ్య, కార్మిక నాయకులు కె.కోటేశ్వరరావు, పి.బాలనరసయ్య, పి.కొండయ్య, పి.పిచ్చయ్య, కడెం కొండలు, శిగినం వెంకటేశ్వర్లు, పెద్ద సిద్దయ్య, ఏసేబు, ఆరికట్ల శ్రీను, చిన్నా పాల్గొన్నారు.

బేస్తవారిపేట: స్థానిక సీపీఐ కార్యాలయం, బస్టాండ్ ఆవరణలో జెండాలు ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో నియోజకవర్గ సీపీఐ నాయకులు డాకాల పుల్లయ్య, యు.జోసఫ్, కొండయ్య, సీఐటీయూ నాయకులు తోట తిరుపతిరావు, షేక్ అన్వర్‌బాషా, దునునాథం, కాశయ్య, అమృతరాజు పాల్గొన్నారు. కార్మికులు కట్టు బానిసలుగా చేసేందుకు లేబర్ కోడ్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు.


మార్కాపురం క్లాక్‌టవర్ వద్ద కార్మిక జెండా ఆవిష్కరిస్తున్న అందె నాసరయ్య తదితరులు

కంభం: కంభంలో సీఐటీయూ, సీపీఐ, ఏఐటీయూసీ, సీపీఎం, ఇతర ప్రజాసంఘాల నాయకులు కార్మిక జెండాలు ఆవిష్కరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ అధ్యక్షుడు బల్లారపు రోశయ్య, సీఐటీయూ నాయకులు తోట తిరుపతిరావు, అన్వర్, ఏఐటీయూసీ నాయకుడు మహమ్మద్ ఇబ్రహీం, కార్మికులు పాల్గొన్నరు.

కొమరోలు: కొమరోలులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కొమరోలులోని నాలుగు రోడ్ల కూడలి వద్ద మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘ నాయకుడు షేక్ మహమ్మద్ ఇబ్రహీం కార్మిక జెండా ఆవిష్కరించారు. కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వాలు దృష్టి సారించి, ప్రభుత్వ రాయితీలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసనాయుడు, చిన్నరాజు, శ్రీనివాసులు, బాలఅంకయ్య, తదితరులు పాల్గొన్నారు.



బేస్తవారిపేట : సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగ కమిటీ సెక్రటరీగా వేమిరెడ్డి


వేమిరెడ్డి రామచంద్రా రెడ్డి

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం కమిటీ సెక్రటరీగా గిద్దలూరుకు చెందిన వేమిరెడ్డి రామచంద్రారెడ్డిని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. పార్టీ ఆవిర్భావం నుంచి వైఎస్సార్ సీపీ అభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలను గుర్తించిన అధిష్టానం మున్సిపల్ విభాగం సెక్రటరీగా నియమించింది. తనపై నమ్మకం ఉంచి పార్టీ పదవి అప్పగించినందుకుగాను వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కె.పి.నాగార్జునరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

శంకరాచార్య జయంత్యుత్సవాలు ప్రారంభం


కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

మార్కాపురం టౌన్: జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంత్యుత్సవాలు గురువారం మార్కాపురం పట్టణంలోని శివాలయంలో ప్రారంభమయ్యాయి. ఈనెల 2వ తేదీన శంకరాచార్య జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు గురువారం స్వామివారి చిత్రపటాన్ని ఆలయంలో ప్రతిష్ఠించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. సాయంత్రం సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణులకు అన్నసంతర్పణ చేశారు. పలువురు బ్రాహ్మణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం


వంగపాడులో రామాలయం వద్ద విరిగిపడిన చెట్టు

బేస్తవారిపేట: బేస్తవారిపేట మండలంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వంగపాడులో రామాలయం వద్ద, గ్రామస్తుడు కోటయ్య గృహం వద్ద భారీ వృక్షాలు ఈదురుగాలులకు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బుధవారం అర్ధరాత్రి సమయంలో ఈదురుగాలులకు రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. చిన్నపాటి గాలివానకు సైతం విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంపై విద్యుత్ వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కంభంలో ఉరుములతో కూడిన వర్షం

కంభం: గురువారం సాయంత్రం మండలంలోని పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. పెనుగాలులకు పలు చోట్ల చెట్లకొమ్మలు విద్యుత్ తీగలు పడ్డాయి. మరికొన్ని చోట్ల గాలులకు తీగలు తెగిపోవడం, మంటలు చెలరేగడం లాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఇదెక్కడి న్యాయం సారూ?


పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఇసుక ట్రాక్టర్

కంభం: తాము డబ్బు పెట్టి కొనుక్కున్న ఇసుకను మరోచోటకు ట్రాక్టర్‌లో తీసుకెళ్తుంటే అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారని ఓ బిల్డర్ వాపోయారు. రెండు టిప్పర్ల ఇసుకను టన్ను రూ.1200 చొప్పున కొనుగోలు చేసి బుధవారం రాత్రి స్థానిక అర్అండ్‌బీ బంగ్లా ఎదురుగా తాను నిర్మిస్తున్న ఓ భవనం వద్ద దించుకున్నానని బిల్డర్ కృష్ణ తెలిపారు. గురువారం ఉదయం మరో చోట తాను నిర్మిస్తున్న భవనం వద్దకు ఇసుక అవసరమై ఇక్కడ ఉన్న ఇసుకను ట్రాక్టర్‌లో తీసుకెళ్తుండగా స్థానిక వైజంక్షన్ వద్ద కొందరు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారని, ఆ తర్వాత పోలీసులు ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారని బిల్డర్‌తోపాటు ట్రాక్టర్ డ్రైవర్ కృష్ణ వివరించారు. తాము డబ్బు పెట్టి కొన్న ఇసుకను తీసుకెళ్తే అడ్డుకోవడం ఏమిటో అర్థం కావడం లేదని, ఇలా అయితే భవనాలు ఎలా నిర్మించుకోవాలని సదరు బిల్డర్ వాపోతున్నారు. ఈ విషయమై ఎస్సై నరసింహారావును వివరణ కోరగా ట్రాక్టర్ కు సంబంధించిన డాక్యుమెంట్లు తీసుకొస్తే పరిశీలించి వదిలేస్తామని తెలిపారు.

ఎన్ఎస్ అగ్రి కాలేజీ విద్యార్థుల రక్తదానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్మోహన్‌రావు

మార్కాపురం: ఎన్ఎస్ అగ్రికల్చర్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు కాలేజీ అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్‌వీఎస్‌కే రెడ్డి తెలిపారు. ఎన్ఎస్ఎస్ విభాగంలో మొత్తం 56 మంది విద్యార్థులు ఉండగా 45 మంది రక్తదానం చేశారు. కార్యక్రమానికి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రరావు, ఐటీడీఏ జిల్లా వైద్యాధికారి డీవైఎంహెచ్‌ఓ డాక్టర్ రవి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కళాచంద్ర, డాక్టర్లు సింధు, ప్రవళిక, సంజనవేణి, మిరియాల చలపతిరావు, బ్లడ్ బ్యాంకు సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి జానకినాథ్ వర్మ, ఓఎస్‌ఏ డాక్టర్ లక్ష్మయ్య, బ్రహ్మారెడ్డి, ఐశ్వర్య, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.